డివైడర్ అవతలి వైపునకు వెళ్లి.. కారు, బైక్‌లను ఢీకొని..

- ఓ కారు బీభత్సం, పలువురికి గాయాలు
- పెద్దఅంబర్‌పేట్ ఔటర్ జంక్షన్ వద్ద ఘటన



ప్రమాదంలో ధ్వంసం అయిన కారు ముందు భాగం

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై ఓ కారు బీభత్సం సృష్టించింది. ఓవర్ స్పీడుతో డివైడర్ అవతలి వైపు వెళ్తున్న కారుతో పాటు రెండు బైక్‌లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం ఉదయం పెద్దఅంబర్‌పేట్ ఔటర్ రింగు రోడ్డు జంక్షన్ వద్ద విజయవాడ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని గచ్చిబౌలి గోపన్‌పల్లికి చెందిన ముత్తవరపు వెంకటరమణ, ప్రదీప దంపతులు కొత్త కారు రిజిస్ట్రేషన్ కోసం సొంతూరులోని సూర్యాపేట జిల్లా కోదాడకు బుధవారం బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు నగర శివారు పెద్దఅంబర్‌పేట్ ఔటర్ రింగురోడ్డు జంక్షన్ విజయవాడ జాతీయ రహదారిపై సంపూర్ణ హోటల్ వద్దకు చేరుకుంది. ఇదే సమయంలో అబ్దుల్లాపూర్‌మెట్ వైపు నుంచి నగరం వైపునకు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ఓవర్ స్పీడుతో వనస్థలిపురానికి చెందిన పుతిన్‌తేజ్.. కారుతో వచ్చి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఆతర్వాత డివైడర్ దాటి అవతలి వైపులో వెళ్తున్న వెంకటరమణ కారుతో పాటు రెండు బైక్‌లను సైతం ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వెంకటరమణ మెడకు, ప్రదీపకు పొత్తి కడుపులో గాయమైంది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న లింగస్వామితో పాటు అతడి కూతురు శాన్వీ, మరో బైక్‌పై వెళ్తున్న మల్లారెడ్డికి గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా, కొద్ది సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



హయత్‌నగర్ లక్ష్మీప్రియనగర్ కాలనీలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న వ్యాపార సముదాయాన్ని కూల్చి వేస్తున్న ఎక్స్‌కవేటర్

అనుమతి లేని నిర్మాణం కూల్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హయత్‌నగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అన్మగల్ హయత్‌నగర్‌లో తిరిగి నిర్మిస్తున్న అనుమతి లేని నిర్మాణాన్ని అధికారులు కూల్చి వేశారు. 'షోకాజ్ నోటీసు చింపివేత.. లక్ష్మీప్రియ కాలనీలో దర్జాగా మళ్లీ అక్రమ నిర్మాణం' పేరుతో బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రచురించిన కథనానికి స్పందనవచ్చింది. హయత్‌నగర్ డివిజన్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్యామ్‌సన్ ఆధ్వర్యంలో అధికారులు.. అనుమతి లేకుండా నిర్మిస్తున్న వ్యాపార సముదాయాన్ని ఎక్స్‌కవేటర్‌తో కూల్చి వేశారు. ఇంటి నిర్మాణానికి అనుమతులు తీసుకుని వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేస్తున్నారని ఇది సరియైన పద్ధతి కాదన్నారు. అనుమతి ప్రకారమే ఇంటి నిర్మాణం చేయాలని కోరారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ అక్బర్, చైన్‌మెన్‌లు సతీష్ యాదవ్, సాయి పాల్గొన్నారు.



కాలిపోయిన గుడిసెలను పరిశీలిస్తున్న ఆర్డీవో అనంతరెడ్డి తదితరులు

మమ్మల్ని ఆదుకోవాలి : బాధితుల వేడుకోలు

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మమ్మల్ని ఆదుకోవాలని, అగ్ని ప్రమాదంలో తాము సర్వం కోల్పోయామని, నిత్యావరాలతో పాటు పిల్లల సర్టిఫికెట్‌లు కూడా కాలిపోయాయని బాధితులు తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూర్ రావినారాయణరెడ్డి కాలనీలో అగ్ని ప్రమాదంలో కాలిపోయిన గుడిసెలను బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి సీపీఐ నాయకులతో కలిసి ఇబ్రహీంపట్నం డివిజన్ ఆర్డీవో అనంతరెడ్డి సందర్శించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. సుమారు 200 కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాలు సేకరించామని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తామని తెలిపారు. ప్రజలకు కనీస వసతులు విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని సీపీఐ రాష్ట్ర నాయకులు రవీంద్రచారి, ముత్యాల యాదిరెడ్డి కోరారు. నాయకులు అజ్మీర్ హరిసింగ్‌నాయక్, ప్రసాద్, యాగిరి, సైదులు, నవనీత, అరుణ, సుజాత, వినోద్, వీరేష్ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో హోటల్ కార్మికుడి ఆత్మహత్య

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలతో దిల్‌సుఖ్‌నగర్‌లోని హోటల్ కార్మికుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మలక్‌పేట ఎస్ఐ నవీన్ తెలిపిన వివరాల ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్‌లోని షైపిల్ హోటల్‌లో ఒడిశా రాష్ట్రానికి చెందిన సుజయ్‌కుమార్ (23) పనిచేస్తున్నాడు. గతేడాది వివాహం చేసుకున్న అతను ఒడిశా నుంచి నగరానికి వచ్చి దిల్‌సుఖ్‌నగర్‌లో నివాసముంటున్నాడు. ప్రస్తుతం భార్య గర్భిణి. ఆమెను సొంతూరుకు పంపి ఈనెల 28న నగరానికి తిరిగొచ్చాడు. రోజూలాగే ఇదే హోటల్‌లో పనిచేస్తున్నాడు. తర్వాత తన గదికి వెళ్లి విశ్రాంతి తీసుకున్న సుజయ్‌కుమార్ ఏప్రిల్ 29న తన గది నుంచి బయటికి రాకపోవడంతో అనుమానం వచ్చి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా తోటి కార్మికులు గుర్తించారు. వెంటనే మలక్‌పేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఇక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి బుధవారం కుటుంబీకులకు అప్పగించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సైదాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో గాయాలతో రోడ్డు పక్క పడి ఉన్న ఓ వ్యక్తిని పోలీసులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. ఎల్‌బీనగర్ గుంటి జంగయ్యనగర్ కాలనీకి చెందిన మధు(55) మంగళవారం రాత్రి రోడ్డు పక్క అపస్మారకస్థితిలో పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు డయల్ 100కు సమాచారమందించారు. వెంటనే సైదాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయాలతో ఉన్న వ్యక్తి చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజాము మృతి చెందినట్లు సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు.

ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు స్కాలర్‌షిప్ టెస్టు

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ దిల్‌సుఖ్‌నగర్ ఆధ్వర్యంలో మే 25న స్కాలర్ షిప్ టెస్టు నిర్వహించనున్నట్లు ప్రముఖ సినీనటి తెలుగు బిగ్ బాస్ ఫేమ్ కుమారి అశ్విని శ్రీ బుధవారం సాయంత్రం ప్రకటించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల డిప్లొమా, డిగ్రీ, ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సు, పీజీ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు యువత ఫ్యాషన్ రంగాన్ని ఎంచుకోవాలనుకుంటున్న విద్యార్థులకు ఎన్ఐఎఫ్‌డీ అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ యేడు కూడా 2025-26 విద్యా సంవత్సరానికి స్కాలర్‌షిప్ పరీక్ష -1 నిర్వహించడానికి, తేదీలతో పాటు టెస్టుల నిర్వహణకు సంబంధించి రూ.15లక్షల చెక్కును ఆమె అందజేశారు.

సర్కారు స్కూళ్లదే హవా



డి.భువనేశ్వరి 552/600



బిలాల్ అలీఖాన్ 555/600



బి.నందిని 551/600



ఎస్.అద్వీత 595/600 (స్టేట్ స్కూల్)



కె.వంశీ 544/600

చంపాపేట: కర్మన్‌ఘాట్‌లోని ఉన్నత పాఠశాలలో 128 మంది టెన్త్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 113మంది (88.2శాతం) ఉత్తీర్ణులయ్యారు. డి.భువనేశ్వరి 552/600మార్కులు, కె.వంశీ 544/600, కె.మాధురి 541/600 మార్కులు సాధించినట్లు హెచ్ఎం పద్మ తెలిపారు. చంపాపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 136 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 109 మంది (80శాతం) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బిలాల్ అలీఖాన్ 555/600 , బి.నందిని 551, దాక్షయని 533 మార్కులు సాధించినట్లు హెచ్ఎం విజయ తెలిపారు. సముద్రాల అద్వీత 595/600 మార్కులు సాధించింది.

చాదర్‌ఘాట్: చార్మినార్ మండలం పరిధిలోని 16 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 375 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా ఇందులో 330 మంది ఉత్తీర్ణత సాధించారు. మండలం పరిధిలో 88 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చార్మినార్ మండలం డిప్యూటీ డీఈవో సుజాత తెలిపారు. చార్మినార్ మండలం పరిధిలోనే చాదర్‌ఘాట్‌లోని ప్రభుత్వ సిటీ మోడల్ హై స్కూల్‌కు చెందిన సకీనా బేగం 541 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిందన్నారు.

సైదాబాద్ : సైదాబాద్ మండల పరిధిలోని 11 ప్రభుత్వ పాఠశాలలో 94 శాతం ఉతీర్ణత సాధించినట్లు ఉప విద్యాశాఖాధికారి రాధాకృష్ణ తెలిపారు. మలక్‌పేట స్కూల్ విద్యార్థిని పొలిచెర్ల మాదురి 539 మార్కులు, శంకేశ్వర్ బజార్ స్కూల్ విద్యార్థిని పావని 536 మార్కులతో మండల టాపర్లుగా నిలిచారన్నారు. ఇదే ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ అంధ బాలికల పాఠశాల, మాదన్నపేట, ఐఎస్‌సదన్ డివిజన్ సాయినగర్‌లోని కాచిగూడ ప్రభుత్వ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

హయత్‌నగర్: హయత్‌నగర్ మండల విద్యాశాఖ పరిధిలోని మూడు ప్రభుత్వ పాఠశాలలలో హయత్‌నగర్ పాఠశాలకు చెందిన రవికిరణ్‌కు 528 మార్కులు, శివ చరణ్ 527 మార్కులు సాధించారు.

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి రేవంత్ కుమార్ 529 మార్కులు సాధించి పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచారు. వనస్థలిపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థి సుమిత్ 528 మార్కులతో పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచారు.

సరూర్‌నగర్ : బాలాపూర్ మండలంలో బాలాపూర్‌తో పాటు మామిడిపల్లి, బడంగ్‌పేట్, నాదర్‌గుల్, జిల్లెలగూడ, పహాడీషరీఫ్‌లలో ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 425 మంది పరీక్షలకు హాజరవగా వారిలో 319 మంది (75.01శాతం) పాసయ్యారు. తెలుగు మీడియంలో 157 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 98 మంది(62.04 శాతం) ఉత్తీర్ణులయ్యారు. తెలుగు మీడియంలో జిల్లెలగూడ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన రూపావత్ తరుణ్ 501 మార్కులతో మండల టాపర్‌గా నిలిచాడు.

మన్సూరాబాద్ : నాగోల్, మన్సూరాబాద్ డివిజన్ల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన ఫలితాలతో ఫర్వాలేదనిపించాయి. నాగోల్ డివిజన్ మమతానగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 600 మార్కులకు గాను 531 సాధించిన ఎస్.చైతన్య అనే విద్యార్థిని స్కూల్ టాపర్‌గా నిలవగా.. 529 మార్కులతో యు.శ్రీనిత్‌గౌడ్, 524 మార్కులతో ఎం.చరణ్ తేజ్ గౌడ్‌లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. రాజీవ్‌గాంధీనగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 600 గాను 555 మార్కులతో భవ్యలత స్కూల్ టాపర్‌గా నిలిచింది. మన్సూరాబాద్ డివిజన్ బండ్లగూడ రోడ్డులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 555 మార్కులతో ఎస్‌కే హస్లా ఫనీసా స్కూల్ టాపర్‌గా నిలిచింది.



భవ్యలత (555/600)



హస్లా ఫనీసా (555/600)

అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 1017 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 799 మంది ఉత్తీర్ణులయ్యారు. మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన మండలి కీర్తన 564 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. మునగనూర్‌లోని గురుకుల బాలికల పాఠశాలకు చెందిన స్వప్న 563, బాటసింగారం గురుకుల బాలుర స్కూల్‌కు చెందిన వరుణ్ 562, అనాజ్‌పూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన నందిని 557, మీనాక్షి 554, సంకీర్తన 551, మార్కులు సాధించారు. మజీద్‌పూర్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎడ్ల శివ తేజా 537 మార్కులు, బాటసింగారం జడ్పీహెచ్ఎస్‌కు చెందిన చింతపట్ల రీచా 543, బిందు మహాలక్ష్మి 539, కీర్తన 533 మార్కులు సాధించారు. కోహెడ స్కూల్‌కు చెందిన సౌమ్య 539, రాగన్నగూడ పాఠశాలకు చెందిన కడారీ దీపిక 539, కనుగుల హసినీ 521 మార్కులు సాధించింది. మండలంలోని కవాడిపల్లి, బండరావిరాల, అబ్దుల్లాపూర్‌మెట్, మజీద్‌పూర్, బాటసింగారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు.



మండలి కీర్తన (564/600)



స్వప్న (563 /600)



వరుణ్ (562/600)



నందిని (557/600)



బ్రిలియంట్ విద్యార్థులను అభినందిస్తున్న సంస్థ చైర్మన్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

బ్రిలియంట్ విద్యాసంస్థల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత

- చైర్మన్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బ్రిలియంట్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి ప్రత్యేకతను చాటుకున్నారు. రాష్ట్ర స్థాయిలో 680 మంది విద్యార్థులు 587, 582, 580 మార్కులు సాధించి తమ సత్తాను చాటుకున్నారని బ్రిలియంట్ విద్యా సంస్థల చైర్మన్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. అదేవిధంగా 850 మంది విద్యార్థులు 550 మార్కులకు పైగా, 77 మంది 500 మార్కులకు పైగా సాధించి తమ సత్తా చాటారని ఆయన తెలిపారు.

బసవేశ్వరస్వామి ఆశయాలను కొనసాగిద్దాం

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి
- స్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి



బసవేశ్వరస్వామి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, దీపావళి శ్రవణ్‌కుమార్

వనస్థలిపురం, ఏప్రిల్ 30(ఆంధ్ర జ్యోతి): బసవేశ్వర స్వామి ఆశయ సాధనకు కృషి చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఆయన 892వ జయంతి బుధవారం వనస్థలిపురం రైతు బజార్ వద్ద నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. బసవేశ్వర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మహనీయుడి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, దీపావళి శ్రవణ్ కుమార్, నాయకులు లగ్గొని శ్రీధర్‌గౌడ్, ప్రభాకర్, సంజయ్ కుమార్, శ్రీకాంత్, సతీష్‌కుమార్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

మన్సూరాబాద్: మన్సూరాబాద్ డివిజన్ జడ్జెస్‌కాలనీలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో బుధవారం స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ వేడుకకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయన్ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పోచబోయిన జగదీష్‌యాదవ్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



సమావేశంలో ఉపకమిషనర్ సుజాత

రోడ్లను ఆక్రమించొద్దు : డిప్యూటీ కమిషనర్

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారాలు చేసుకునే వారు రోడ్లను ఆక్రమించకుండా వ్యాపారం చేసుకోవాలని జీహెచ్ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ సుజాత శ్రీధర్ సూచించారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీధి వ్యాపారులు చెత్తను రోడ్డుపై వేయకుండా చెత్తబుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వీధి వ్యాపారులకు రుణాలు, ఇన్సూరెన్స్ గురించి వివరించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వీధి వ్యాపారులకు అనువైన ప్రదేశాలను గుర్తించి వెండింగ్ జోన్స్ ఏర్పాటు చేస్తామన్నారు. అక్కడే వారు వ్యాపారాలు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి విక్రాంత్‌రెడ్డి, శానిటేషన్ డీఈ చందన, సీవోలు సహదేవ్, శోభన, సమతాపురి కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ల అక్రమణల తొలగింపు

వనస్థలిపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఫుత్‌పాత్ ఆక్రమణలను అధికారులు తొలగించారు. బీఎన్‌రెడ్డినగర్ నుంచి వనస్థలిపురం రెడ్ ట్యాంక్ వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఫుట్‌పాత్‌ను ఆక్రమించి నిర్మించినవి బుధవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే సహించేది లేదన్నారు. ఈ ప్రధాన రహదారిపై విపరీతమైన ట్రాఫిక్ రద్దీ రీత్యా పలువురు కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిబ్బందితో తొలగించామన్నారు.

అడ్డుకున్న వ్యాపారులు

కాగా వనస్థలిపురం పోలీస్ స్టేషన్ సమీపంలో చిరువ్యాపారుల సముదాయాలను తొలగించడానికి వెళ్లిన మున్సిపల్ అధికారులను వ్యాపారులు అడ్డుకున్నారు. వెంటనే వారు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, చింతల రవికుమార్‌లకు సమాచారం అందించారు. దీంతో వెంటనే ఇక్కడికి చేరుకొని చిరువ్యాపారులకు అండగా నిలబడ్డారు. కూల్చివద్దని సదరు మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి, రామ్మోహన్‌గౌడ్‌లు మాట్లాడారు. దీంతో అధికారులు వెనుదిరిగి పోయారు.



ప్రదర్శనలో ఆకట్టుకుంటున్న రకరకాల చేపలు

సమ్మర్ మేళాలో సందడే సందడి

ఖైరతాబాద్, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): వందల రకాల చేపలతో ఏర్పాటు చేసిన ఫిష్ టన్నెల్ -ఎల్‌బీ నగర్ సమ్మర్ మేళా ఒక కొత్త అనుభూతిని సందర్శకులకు పంచుతోంది. ఎల్‌బీ నగర్ కామినేని ఆస్పత్రి సమీపంలో ఏర్పాటు చేశారు. కాగా, చిన్నారులు, వృద్ధులు సరదా వాతావరణంలో గడుపుతున్నారు. ఉదయం నుంచి తీవ్రమైన ఎండలతో సతమతమవుతున్న నగరవాసులకు చల్లటి వాతావరణంలో ప్రత్యేకంగా ఏర్పాటైన ఫిష్ టన్నెల్‌లో ఎన్నడూ చూడ లేని వందల రకాల చేపలు సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. దీంతో పాటు రకరకాల ఎమ్యూజ్‌మెంట్లలో పిల్లలు, యువత ఉత్సాహంగా ఉల్లాసంగా ఉండటం కనిపిస్తోంది. దీంతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన అనేక రకాల వస్తువులు కచ్చితమైన ధరలకు ఇక్కడ లభిస్తున్నాయి. రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని నిర్వాహకుడు సయ్యద్ మొయిన్ అలీ తెలిపాడు.

ఎప్‌సెట్ పరీక్షకు 234 మంది హాజరు

మన్సూరాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఇంజినీరింగ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఈఏపీసీఈటీ)కు 234మంది అభ్యర్థులు హాజరయ్యారు. బుధవారం కొత్తపేట డివిజన్ న్యూనాగోల్‌కాలనీలో ఏర్పాటు చేసిన సీఐఓఎస్ డిజిటల్ ప్రైవేటు లిమిటెడ్ కేంద్రంలో ఈ పరీక్ష నిర్వహించారు. మొత్తం 245 మందికి గాను 234 మంది పరీక్ష రాశారు. కాగా ఫేస్ కంప్రెహెన్స్‌లో ముగ్గురు అభ్యర్థులు ఫెయిల్ కాగా ఇతర గుర్తింపు కార్డుతో వారు పరీక్ష రాసేందుకు అనుమతించారు.

అర్హులకు ఇంటి స్థలాలివ్వండి : సీపీఎం

హయత్‌నగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సాహెబ్‌నగర్ కలాన్‌లోని సర్వే నంబర్ 71/1, 162లో అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కమిటి కార్యదర్శి పగడాల యాదయ్య కోరారు. బుధవారం హయత్‌నగర్ తహసీల్దార్ జానకీకి వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 71/1, 162ను కొంత మంది అక్రమంగా ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. ఇంటి స్థలాలు పేదలకు ఇవ్వాలని 2023లోనే 1,200 మంది కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నామని తెలిపారు. మండలంలో ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూంలను పేదలకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చంద్రమోహన్, జిల్లా కమిటీ సభ్యుడు కీసరి నర్సిరెడ్డి, సర్కిల్ కార్యదర్శులు ఎల్లయ్య, వెంకన్న, నాయకులు కృష్ణయ్య, గణేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న మధుయాష్కీ

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్(సీఎంఆర్ఎఫ్)ను సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. వనస్థలిపురంలోని పార్టీ కార్యాలయంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు డివిజన్‌లకు చెందిన పలువురికి ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ ఫండ్ ద్వారా అనేక మందికి పేదలకు ఆర్థికంగా ఎంతో ఉపశమనం కలుగుతోందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నేలపాటి రామారావు, పాశం అశోక్ గౌడ్, బుడ్డ సత్యానారాయణ, నాయకులు వేణుగోపాల్ యాదవ్ పాల్గొన్నారు.